విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

శనివారం 20 జూలై 2024 8 పేజీలు

ముసురు

- నేడు, రేపు భారీ వర్ష సూచన
- పలుచోట్ల ఒక మోస్తరు వర్షం
- ఖరీఫ్ సాగుకు ఊతం
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతాంగం
- వర్షాలపై అప్రమత్తమైన అధికారులు

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గత రెండు రోజులుగా జిల్లా వ్యాప్తంగా ఒక మోస్తరు నుంచి భారీ వర్షపాతం నమోదవుతుంది. అల్పపీడన ప్రభావంతో గత రెండు రోజుల నుంచి జిల్లాకు ముసురు పట్టింది. నేడు, రేపు భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరిస్తుంది. ఈ నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం కూడా అప్రమత్తమైంది. నిన్న మొన్నటి వరకు జిల్లాలో ఎండ తీవ్రతతో తల్లడిల్లిన ప్రజానీకానికి ప్రస్తుతం అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. జిల్లాకు భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు అధికారులు వెల్లడిస్తున్న నేపథ్యంలో ఈసారి ఖరీఫ్ సాగుకు మేలు జరిగే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తుంది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది రాష్ట్రంలో బారీ వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు ఇప్పటికే వాతావరణశాఖ వెల్లడించింది. ఈ నేపథ్యంలో జిల్లాకు భారీ వర్షాలు పడే అవకాశం ఉన్న నేపథ్యంలో ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. జిల్లాలో వ్యవసాయ రంగం కేవలం వర్షాధారంపైనే ఆధారపడివుంది. నాగార్జునసాగర్ ఆయకట్టు ఉన్నప్పటికీ వ్యవసాయ రంగానికి సాగునీరు గత రెండేళ్లుగా ఇవ్వడం లేదు. కేవలం మంచినీటికోసమే సాగర్‌నీరు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం అల్పపీడన ప్రభావంతో జిల్లాలో వర్షాలు కురుస్తుండటంతో ఖరీఫ్ సాగు ముమ్మరంగా సాగే అవకాశాలు ఉన్నట్లు వ్యవసాయ అధికారులు తెలుపుతున్నారు. తీర ప్రాంతాల్లో కొంతమేర బోర్ల ద్వారా వివిధ రకాల పంటలు రైతులు సాగు చేస్తున్నప్పటికీ కనిగిరి, యర్రగొండపాలెం, మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల్లోని ప్రజలు కేవలం వర్షాధారంపైనే ఆధారపడి ఉంది. గత రెండు రోజుల నుంచి కురుస్తున్న ఒక మోస్తరు వర్షాలకు భూమిలో తేమశాతం పెరుగుతుంది. దీని ద్వారా పశ్చిమ ప్రాంతాల్లో సాగులో ఉన్న పండ్ల తోటలకు ఈ వర్షం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రైతులు వెల్లడిస్తున్నారు. మరో రెండు రోజుల పాటు జిల్లాలో భారీ వర్షాలు పడే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రమైన ఒంగోలులో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు చిరు జల్లులు పడుతున్నాయి.

ఒంగోలులోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రకాశం జిల్లా సీపీఐ సమితి సమావేశంలో పాల్గొన్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ

- విశాలాంధ్ర, ఒంగోలు

ఈతకు వెళ్లి ఇద్దరు యువకులు మృతి

- ఒకరి మృతదేహం లభ్యం
- మరొకరి ఆచూకీ కోసం గాలిస్తున్న పోలీసులు

2లో

రసాభాసగా సర్వ సభ్య సమావేశం

వాకౌట్ చేసిన ఎంపీటీసీలు

విశాలాంధ్ర - కర్లపాలెం : కర్లపాలెం మండలంలో ఎంపీటీసీలుగా ఎన్నికైన నాటి నుంచి అప్పటి అధికార పార్టీ వైసీపీ తరఫున గెలిచిన ఎంపీటీసీలు ఎంపీపీ పీఠం మార్పు కోసం జరిగిన గందరగోళాలతో నేటికీ ఎంపీటీసీలు వారి హక్కుల కోసం పోరాడుతూనే ఉన్నారు.అప్పటి అధికార పార్టీ ఎమ్మెల్యే కోన రఘుపతి కర్లపాలెం ఎంపీపీ యారం వనజకు సహకరించొద్దని బహిరంగంగా తెలపడంతో ఏ ఒక్క ఎంపీటీసీ సహకరించిన దాఖలాలు లేవు.మూడేళ్ల పాటు ఎంపీటీసీలు ఎవరు కూడా వారి పరిధిలో ఒక్క అభివృద్ధి కార్యక్రమం కనీసం చేతి పంపు కూడా వేయని పరిస్థితి నెలకొంది.అప్పటి ఎమ్మెల్యే కోన రఘుపతి మాటలు విని అధికారులు పూర్తిగా మండలాన్ని భ్రష్టు పట్టించారు.ఇప్పుడు తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో మాగోడు ఇప్పుడైనా వింటారా అంటూ విజ్ఞప్తులు చేసుకుంటున్నారు.శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీలు మాకు గౌరవం ఇవ్వండి మాకు నిధులు ఇవ్వండి అంటూ గత మూడేళ్ల నుంచి పాడిన పాటే చెప్పిన మాటే చెప్పటం జరిగింది.

- ఎంపీపీ యారం వనజ అధ్యక్షతన జరిగిన సర్వ సభ్య సమావేశంలో నల్లమోతువారిపాలెం సెగ్మెంట్ ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావు మాట్లాడుతూ గత పాలుకులు తమ సెగ్మెంట్‌లోని మిగతా 2 లో ...

నదీ తీరప్రాంతవాసులు..అప్రమత్తం

- వరదలొస్తే పునరావాస కేంద్రాలకు వెళ్లాలి
- జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

విశాలాంధ్ర - కొల్లూరు :

అధిక వర్షాలు కురుస్తున్న తరుణంలో కృష్ణా నదికి వరదలు సంభవిస్తే నదీ తీరప్రాంత వాసులు ప్రభుత్వం ఏర్పాటు చేసే పునరావాస కేంద్రాలకు తరలిరావాల్సి ఉంటుందని బాపట్ల జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళీ ప్రజలను ముందస్తుగా హెచ్చరించారు. శుక్రవారం కొల్లూరు మండలపరిధిలోని కృష్ణా నదీ తీర ప్రాంత గ్రామాలైన చిలుమూరులంక, సుగ్గునలంక, చింతర్లంక, పెదలంక, పెసర్లంక గ్రామాలలో ఆయన పర్యటించి నదికి వరదలు సంభవించే సమయంలో ముందస్తుగా ఏ చర్యలు చేపట్టాలి అనే అంశాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన లంక గ్రామాల ప్రజలను గతంలో వరదలు సంభించిన సమయంలో నెలకొన్న పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వరదలు అధికంగా వచ్చే అవకాశాలు ఉన్న నేపథ్యంలో తీర ప్రాంతాల ప్రజలను ముందుగానే ప్రభుత్వం సురక్షిత ప్రాంతాలలో ఏర్పాటు చేసే పునరావాస కేంద్రాలకు తరలించడం జరుగుతుందని, ఆ సమయంలో ప్రజలందరూ ప్రభుత్వ యంత్రాంగానికి సహకరించి కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. వరదల కారణంగా ఎటువంటి ప్రాణ నష్టం సంభవించకుండా ఎప్పటికప్పుడు ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉంటూ ప్రజలను అప్రమత్తం చేయడం జరుగుతుందన్నారు. వరదలు వచ్చే పక్షంలో గ్రామాలలోని గర్భిణీలు, బాలింతలు, వృద్దులను ముందుగా ప్రభుత్వం ఏర్పాటు చేసే పునరావాస కేంద్రాలకు తరలించడంపై అధికార యంత్రాంగం దృష్టి సారించాలని ఆదేశించారు. తొలుత పెసర్లంక అరవింద వారధి వద్ద కృష్ణా నదిని పరిశీలించిన ఆయన నదికి ఏర్పడిన గండిని పరిశీలించి నదికి తక్కువ మొత్తంలో వరద నీరు వచ్చినప్పటికీ కొల్లూరు కరకట్ట వైపునున్న పల్లపు భూముల్లోకి నీరు ప్రవేశించకుండా తాత్కాలికంగా మట్టితో అడ్డుకట్ట వేయడానికి అంచనాలు రూపొందించాలని ఆర్‌సీ అధికారులను ఆదేశించారు. పెసర్లంకలో స్థానికులు కలెక్టర్ దృష్టికి పలు సమస్యలను తీసుకొచ్చారు. 13 లంక గ్రామాలకు ప్రధాన మార్గమైన రహదారి గుంతల మయంగా మారడంతో ప్రయాణం కష్టతరమౌతుందని రహదారి నిర్మాణం చేపట్టాలని కోరారు. ప్రభుత్వం ఉచిత ఇసుక పథకం అమలులోకి తీసుకొచ్చిన నేపథ్యంలో నదిలో ట్రాక్టర్ల ద్వారా ఇసుక రవాణాకు అనుమతించాలని కోరడంతో ప్రభుత్వం నిర్దేశించిన స్టాక్ పాయింట్‌లలో మాత్రమే ఇసుక తరలింపుకు అనుమతి ఉంటుందని, ఇష్టానుసారం ఇసుక తవ్వకాలు చేపట్టడానికి అనుమతులు ఇవ్వడం సాధ్యపడదన్నారు.

ఫేక్ ప్రచారానికి బ్రాండ్ అంబాసిడర్ జగన్

మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయస్వామి

విశాలాంధ్ర-ఒంగోలు : వినుకొండలో వ్యక్తిగత కక్షలతో జరిగిన హత్యను టిడిపికి ఆపాదించడం సిగ్గుచేటని, ఎన్నికల్లో ప్రజలు చిత్తు చిత్తుగా ఓడించినా జగన్ మాత్రం తన బుద్ధి మార్చుకోలేదని మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజ నేయస్వామి అన్నారు. సొంత బాబాయిని చంపి నారాసుర రక్త చరిత్ర అంటూ టిడిపిపై తప్పుడు ప్రచారం చేసిన నీచ చరిత్ర జగన్ ది. వినుకొండలో జరిగిన హత్యకు ముఖ్యకారకుడు జగనే. వైసీపీ హయాంలో హతుడు రషీద్ నిందితుడు జిలానీ మధ్య జరిగిన గొడవలపై నాడే చర్యలు తీసుకుని ఉంటే నేడు ఈ హత్య జరిగేదా? నాడు జగన్ చేసిన పాపానికి మూల్యం ఒక వ్యక్తి నిండు ప్రాణం. వైసీపీ హయాంలో జగన్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని అన్నారు. నాడు ప్రతిపక్ష నేతల్ని బయట తిరగకుండా అడ్డుకున్న పిరికిపంద జగన్ అన్నారు. గతంలో రాష్ట్రంలో ఏ సంఘటన జరిగినా బాధిత కుటుంబాలను ప్రతిపక్ష నేతలు పరామర్శించకుండా పోలీసులు అడ్డుపెట్టుకొని జగన్ నియంతృత్వంగా వ్యవహరించారు. కానీ నేడు టిడిపి పాలనలో జగన్ స్వేచ్ఛగా తన పర్యటనలు తాను చేసుకుంటున్నారు. టీడీపీ, వైసీపీ పాలనకు మధ్య తేడాను ప్రజలు గమనించాలన్నారు. జగన్ ఇకనైనా శవ రాజకీయాలు మానుకోవాలని లేదంటే ప్రజలే జగన్‌ని శాశ్వతంగా రాజకీయాలు మానిపిస్తారని అన్నారు.

టాస్క్ ఫోర్స్‌కు దొరికిన ఎర్రచందనం దొంగలు

విశాలాంధ్ర-కొమరోలు : మండలంలోని అక్కపల్లి గ్రామ సమీపంలో ఎర్రచందనం తరలిస్తున్న ముగ్గురిని తిరుపతి టాస్క్ ఫోర్స్ అధికారులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తుల కారులో 25 లక్షల రూపాయలు విలువచేసే 28 ఎర్రచందనం దుంగలను అధికారులు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అలానే ఎర్రచందనం దుంగలను తరలించేందుకు ఉపయోగించిన కారును సీజ్ చేశామని వెల్లడించారు. ప్రస్తుతం పట్టుబడ్డ ఎర్రచందనం దొంగలకు తమిళనాడు స్మగ్లర్లతో సంబంధాలు ఉన్నట్లుగా విచారణలో గుర్తించినట్లు టాస్క్ ఫోర్స్ సీఐ సురేష్ కుమార్ శుక్రవారం తెలిపారు. పట్టుబడ్డ దొంగలను రిమాండ్ కు తరలిస్తున్నామని తిరుపతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో చెప్పారు.

ఆకస్మిక తనిఖీలు చేపట్టిన కలెక్టర్

విశాలాంధ్ర-చీమకుర్తి : చీమకుర్తిలో శుక్రవారం ప్రకాశం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారి ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. ఆమె మొట్టమొదటిగా రామతీర్థ జలాశయం సందర్శించారు. డ్యాంలో నీళ్లు నీటినిలో సామర్థ్యం ఎంత, వర్షాలు పడితే వస్తే నీరు ఎంత నిల్వ ఉంటుంది విషయాలని అడిగి తెలుసుకున్నారు. తదనంతరం గురుకుల పాఠశాలలో సందర్శించి పిల్లలకు అందే వసతులు, క్రమశిక్షణ, స్టడీ,వంటి విషయాలన్నిటిని అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట చీమకుర్తి మండల తహసీల్దార్ సురేష్, ఏ ఈ, మండల స్థాయి అధికారులు ఉన్నారు.

ఈతకు వెళ్లి ఇద్దరు యువకుల మృతి

- ఒకరి మృతదేహం లభ్యం
- మరొకరి ఆచూకీ కోసం గాలిస్తున్న పోలీసులు

విశాలాంధ్ర-టంగుటూరు : ఈతకు వెళ్లి చెరువులో పడి ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన మండలంలోని వల్లూరు చెరువు సమీపంలో గరుగు బావి వద్ద చోటు చేసుకుంది. ఒకరి మృతదేహం నీటిపై తేలియాడుతుండంతో పోలీస్‌లు వెలికితీసి మరొక యువకుని కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈత సరదా కోసం వెళ్లి ఇద్దరు యువకులు మృతి చెందడంతో వాసేపల్లిపాడు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు స్థానికులు తెలిపిన సమాచారం మేరకు వాసేపల్లి పాడు గ్రామానికి చెందిన నల్లమలుపు నవీన్ బాబు బాణాల వెంకటేష్ ఇద్దరు యువకులు గురువారం మధ్యాహ్నం నుండి కనిపించకపోవడంతో నల్లమలుపు నవీన్ తల్లిదండ్రులు శుక్రవారం ఉదయం టంగుటూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. నవీన్ సెల్ ఫోన్ నెంబర్ ఆధారంగా పోలీసులు విచారణ చేపట్టారు. అతని సెల్ ఫోన్ సిగ్నల్ ఢిల్లీ డాబా పరిసర ప్రాంతాల్లో చూపించడంతో పోలీసులు వారికోసం గాలింపు చర్యలు చేపట్టారు. వల్లూరు చెరువు పెళ్లూరు దగ్గరలో ఉన్న విఆర్ పెట్రోల్ బంక్ వెనుక భాగంలో ఉన్న గరుగు బావిలో ఒక మృతదేహం తెలియాడడంతో పోలీసులు బంధువులకు సమాచారం అందించారు. పోలీసులు విచారణ చేస్తున్న ఆ సెల్ ఫోన్‌తో పాటు వారి బట్టలు మరియు ద్విచక్ర వాహనము అక్కడే ఉండడంతో వారి అనుమానం బలపడింది. ఘటన స్థలానికి సింగరాయకొండ సిఐడి రంగనాథ్ టంగుటూరు ఎస్సై పున్నారావు బంధువుల సమక్షంలో ఎన్డిఆర్ఎఫ్ సిబ్బందితో బోటు సహాయంతో నల్లమలుపు నవీన్ (23) మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. మరో యువకుడు బాణాల వెంకటేష్ ఆచూకీ కోసం గరుగు బావిలో ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది బోటు సహాయంతో గరుగు బావి ప్రాంతాన్ని జల్లెడ పట్టారు. చీకటి పడటంతో మృతదేహం వెలికి తీసే పనులకు ఆటంకం కలిగింది. నవీన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

మిన్నంటిన బంధువుల రోధనలు :

గరుగు బావి ప్రాంతంలో వాసేపల్లి పాడు గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు మృతి చెందడంతో బంధువుల రోదనలు మిన్నంటాయి. నల్లమలుపు నవీన్ వారి తల్లిదండ్రులకు ఆరోగ్యం విషమించడంతో ఇంటి వద్దనే ఉంటూ వారికి సపర్యలు చేస్తూ చేదోడువాదోడుగా ఉండేవాడని వారి తల్లిదండ్రులు వాపోయారు. మరో యువకుడు బాణాల వెంకటేష్ అతను ప్రాణాంతకమైన వ్యాధితో బాధపడుతుంటాడని రక్తం నెలకు ఒకసారి మార్పిడి చేసుకుంటూ ఉంటాడని ఈత కోసం వెళ్లి ప్రాణాలు తీసుకోవడం బాధాకరమని బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐ డి రంగనాథ్ మాట్లాడుతూ గాలింపు చర్యలకు చీకటి పడుతుండటంతో వర్షం కూడా తోడవడంతో ఇబ్బందికరంగా ఉందని రేపు ఉదయం మరల ఎన్‌డిఆర్ఎఫ్ సిబ్బందితో కలిసి గాలింపు చర్యలు చేపడతామని తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు చేసి కేసు నమోదు చేసి విచారిస్తామని తెలిపారు.

ఛాంపియన్స్‌కు అభినందనలు

విశాలాంధ్ర-సంతనూతలపాడు : ఈనెల పులివెందులలో 10వ తేదీ నుండి 17వ తేదీ వరకు జరిగిన రెండవ శౌత్ జోన్ జూనియర్ మెన్ అండ్ ఛాంపియన్షిప్‌లో భాగంగా ఆంధ్రప్రదేశ్ ఉమెన్ టీం క్రీడలు జరిగిన ప్రతి టీం పాండిచ్చేరి తెలంగాణ కేరళ కర్ణాటక తమిళనాడు టీములపై విజయం సాధించి ఫైనల్ కి చేరింది. ఆంధ్రప్రదేశ్ మరియు కర్ణాటక టీముల మధ్య ఫైనల్ మ్యాచ్ జరగగా ఈ మ్యాచ్లో కర్ణాటక టీం పై ఐదు గోల్స్ వేసి ఛాంపియన్స్‌గా ఆంధ్రప్రదేశ్ ఉమెన్ టీం నిలిచింది. ఈ టీంకి గూడూరు వాసి కోచ్‌గా ఆకాశ దీపక్ మేనేజర్ తిరుమల శెట్టి రవికుమార్ వ్యవహరించారు. ఈ విజయం సాధించడం పట్ల గురువారం ఛాంపియన్స్ క్రీడా టీముకు అభినందనలు తెలిపారు. తెలిపిన వారిలో ఏపీ హాకీ సీఈఓ ఎం నిరంజన్ రెడ్డి హాకి క్రీడల అధ్యక్షులు బి ఎం చాణిక్య రాజు జనరల్ సెక్రటరీ జి హర్షవర్ధన్ ట్రెజరర్ పి థామస్ పీటర్ జిల్లాహాకీ అసోసియేషన్ సెక్రటరీ ఏ సుందరరామిరెడ్డి ఉన్నారు.

రసాభాసగా సర్వ సభ్య సమావేశం

(మొదటిపేజీ తరువాయి)

అభివృద్ధి పనులకు నిధులు ఇవ్వకుండా ఆటంకంపరిచరాని ఆరోపణలు చేశారు. ఎంపీటీ సీలకు తెలియకుండా అధికారులు కోట్ల రూపాయలు నిధులు డ్రా చేసి అవినీతికి పాల్పడ్డారని ఆరోపణలు చేశారు.క్యాష్ పుస్తకాలు మాకు చూపించాలని అధికారులను డిమాండ్ చేశారు. అదేవిధంగా కర్లపాలెం జగనన్న కాలనీలో పేదలకు అందచేసే ప్లాట్లలో చెరువులోని బురదను మెరకగా వేసి కోట్ల రూపాయలు ప్రభుత్వ సొమ్మును మాజీ ఎమ్మెల్యే తన అనుచరులకు లబ్ది చేకూర్చారని మండిపడ్డారు. జగనన్న కాలనీకి తీసుకున్న స్థలాన్ని మంచి నీటి చెరువుగా ఏర్పాటు చేస్తున్నామని చెప్పిన గత పాలకుడు ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టిని తవ్వడమే కాకుండా బిల్లుల రూపంలో తన అనుచరులకు ప్రభుత్వ ఖజానాన్నే దోచి పెట్టారని గత పాలకులను దుయ్యబట్టారు. జగనన్న కాలని అని చెప్పే ప్రభుత్వ స్థలాన్ని పూడ్చడానికి అంతకు ముందు మంచి నీటి చెరువు కోసం అని తీసుకున్న ప్రభుత్వ స్థలంలో మట్టి తవ్వకొని అటు ప్రభుత్వానికి ఇటు ప్రజలకు కుచ్చు టోపీ పెట్టారు అని మండిపడ్డారు.ప్రభుత్వ స్థలాన్ని పూడ్చడానికి ప్రభుత్వ స్థలాన్నే తవ్వి కోట్లు రూపాయలు బిల్లులు చేసుకున్న వైనంపై విచారణ వేసి న్యాయం చేయాలని కోరారు.ప్రభుత్వ స్థలాన్ని త్రవ్వకుంటుంటే చోద్యం చూస్తూ సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.మాకు న్యాయం జరిగే వరకు ఎంపీటీసీలుగా మమ్మల్ని గౌరవించక పోవడంతో నిరసనగా వాకౌట్ చేస్తున్నట్లు ప్రకటించి సమావేశం నుంచి వెళ్లిపోయారు. వాకౌట్ చేసిన ఎంపీటీసీలు తాంద్ర సాంబశివరావు, దొంతిబోయిన లక్ష్మి సాంబ్రాజ్యం, ఆసిఫ్ అలీ,రాతం శెట్టి లక్ష్మన్, చీరాల పద్మావతి, పులుగు సుబ్బా రెడ్డి, గొర్ల కమల, హైమావతి, దిండు నాగ లక్ష్మిలున్నారు.

– ఈ విషయంపై ఎంపీపీ యారం వనజ మాట్లాడుతూ ఎంపీటీసీలు వారి పరిధిలో ఉన్న సెగ్మెంట్లో అభివృద్ధి పనులు చేయడానికి ఎవరు కూడా ముందుకు రాలేదని,పదే పదే చేయాల్సిన పనులు జాబితా తెలపండి అని కోరిన ఏ ఒక్క ఎంపీటీసీ సభ్యుడు ముందుకు రాలేదని ఇప్పుడు పనులు చేయలేకపోయామని మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు.గతంలో మీరు ప్రవర్తించిన తీరు మీరు ఏ విధంగా చేసింది ఎవరు మాటలు విని ఎట్లా ఉన్నది మీకు తెలియదా అని ప్రశ్నించారు.సర్వ సభ్య సమావేశంలో మాట్లాడే అర్హత ఏ ఒక్క ఎంపీటీసీకి కూడా లేదన్నారు.ప్రతి ఒక్క ఎంపీటీసీకి సహరించడానికి ఎంపీడీఓ,నేను సిద్ధంగా ఉన్నామని ఎంపీపీ తెలిపారు.అధికారంలో ఉన్నప్పుడు ఏ ఒక్కరు మాట్లాడిన దాఖలాలు లేవని అధికారం పోయిన తర్వాత ఇలా మాట్లాడటం సబబేనా అని ప్రశ్నించారు. ఇప్పటికైన మీరు మీ సెగ్మెంట్లనుని అభివృద్ధి చేసుకోవడానికి ముందుకు వస్తే మేము సహరించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నేతాజీ, జడ్పీటీసీ పిట్ల వేణు గోపాల్ రెడ్డి, వైస్ ఎంపీపీ సుబ్బారావు, బుల్లియ్య, సర్పంచులు ఎల్లావుల నాని,శ్రీనివాస రెడ్డి, ఏడుకొండలు, వెంకటేశ్వరమ్మ, వెంకట లక్ష్మీ పాల్గొన్నారు.

ప్రభుత్వ సేవలు పటిష్టంగా అమలు చేయాలి

కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

విశాలాంధ్ర-ఒంగోలు : జిల్లాలో వివిధ కార్యక్రమాల ద్వారా అమలు చేస్తున్న ప్రభుత్వ సేవలు పటిష్టంగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, రిజిస్ట్రేషన్, కమర్షియల్ టాక్స్, ట్రెజరీ, ఆడిట్, ఎండోమెంట్స్ శాఖల అధికారులతో సమావేశమై ఆయా శాఖల ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాలపై సమీక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ కార్యక్రమాల ద్వారా అమలు చేస్తున్న ప్రభుత్వ సేవలు పటిష్టంగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయా శాఖల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలపై సంబంధిత అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఈ సమావేశంలో రిజిస్ట్రేషన్ శాఖ డిఐజి పుష్పలత, జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్ర, కమర్షియల్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ కె కరీం భాషా, జిల్లా ట్రెజరీ అధికారి జగన్నాధ రావు, స్టేట్ ఆడిట్ ఆర్.డి.డి నాగ శ్రీనివాసరావు, జిల్లా ఆడిట్ అధికారి శంకర్ నారాయణరెడ్డి, దేవాదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

దాతల సాయం అభినందనీయం

విశాలాంధ్ర-పామూరు : పేద విద్యార్థినిలు విద్యను అభ్యసించే కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల అభివృద్ధికి దాతల సాయం అభినందనీయమని పాఠశాల ప్రిన్సిపాల్ కే సజన అన్నారు. మండల కేంద్రమైన పామూరులోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలకు పామూరు సిఎస్పురం సింగల్ విండో మాజీ అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డి నారాయణరెడ్డి లు ఇన్వర్టర్లు ను అందజేశారు. దాతలు మాట్లాడుతూ పేద విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. విద్యార్థినిలు బాగా చదువుకుని పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తేవాలని ఆకాంక్షించారు.

నాణ్యమైన విద్యను విద్యార్థినులకు బోధించాలి

జీసీడీఓ సీహెచ్ మాధవి లత

విశాలాంధ్ర-పామూరు : విద్యార్థినులకు క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్యను బోధించాలని జిసిడిఓ సిహెచ్ మాధవి లత అన్నారు. మండల కేంద్రమైన పామూరులోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశా లను శుక్రవారం మాధవి లత ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాల లోని వసతులను పరిశీలించారు. పాఠశాలలో అందుతున్న భోజనం, వసతుల వివరాలను విద్యార్థులనుసు అడిగి తెలుసుకున్నారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో మంచి ఫలితాలను సాధించేందుకు ఇప్పటినుండి కృషి చేయాలని ఉపాధ్యాయునీల సమావేశంలో అన్నారు. పదవ తరగతి విద్యార్థినులలో గణిత శాస్త్రం నైపుణ్యమును పరిశీలించి సూచనలు చేశారు. పాఠశాల రికార్డులను తనిఖీ చేసి మంచి ఫలితాలు సాధనకు ఇప్పటినుండి చర్యలు చేపట్టాలని ప్రిన్సిపాల్ సజనకు సూచనలను మాధవి లత చేశారు.

దోమల నివారణకు పారిశుధ్య చర్యలు

విశాలాంధ్ర-పెద్దారవీడు : మండలంలోని ఎస్ కొత్తపల్లి గ్రామపంచాయితీలో సర్పంచ్ వెన్న సంజీవరాణి ఆదేశాల మేరకు గ్రామంలో దోమల నివారించుటకు గ్రామంలో బ్లీచింగ్ చల్లించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పరిశుభ్రత గ్రామ ప్రజలపై ఆధారపడి ఉందని, పరిసరాల శుభ్రత మన ఆరోగ్యత అన్నారు. క్లాప్ మిత్రలు ప్రతిరోజు ఇంటి వద్దకి వచ్చి చెత్తను సేకరించి డంపింగ్ యార్డ్ చేర్చడం జరుగుతుందని అలాగే కాలువల పూడిక తీయడం క్రమబద్ధకంగా జరుగుతూ ఉంటుందన్నారు. దానికి అనుకూలంగా ప్రతి ఒక్క గ్రామ ప్రజలు సహకరించి భాగస్వాములు కావాలని ఆమె కోరారు.

ప్రమాదంలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర-కొమరోలు : పట్టణ సమీపంలోని అమరావతి కడప రాష్ట్రీయ రహదారిపై గురువారం లారీ ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటన చోటుచేసుకుంది. అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన చిన్న సుబ్బయ్య అనే వ్యక్తి గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మొదట తీవ్రంగా గాయపడ్డ చిన్న సుబ్బయ్యను 108 వాహనంలో గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్న సుబ్బయ్య మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అన్నదానానికి రూ.1.50లక్షల విరాళం

అందజేసిన కేసీపీ సిమెంట్ అధినేత

విశాలాంధ్ర-పామూరు : మండల కేంద్రమైన పామూరు పట్టణంలో దేవాలయం వీధిలో పాత పోస్ట్ ఆఫీస్ ఎదురుగా ఉన్న శ్రీ సాయిబాబా దేవస్థానములో ప్రతి ఏడాది గురు పౌర్ణమి నాడు మహా అన్నదానం నిర్వహించ బడుతుంది. ఈ నెల 21న జరుగు గురు పౌర్ణమికి నిర్వహించు అన్నదానానికి కేసీపీ సిమెంట్ అధినేత్రి ఇందిర దత్తు రూ. 1.50 లక్షల విరాళం అందచేసినట్లు దేవస్థానం చైర్మెన్ పబ్బతి వెంకటసుబ్బయ్య తెలిపారు. ప్రతి ఏడాది సాయిబాబా దేవస్థానం అభివృద్ధికి విరాళం అందజేస్తున్న కెసిపి సిమెంట్ అధినేత ఇందిర దత్తుకు వెంకటసుబ్బయ్య ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

టీడీపీ నేత 'పల్లా'ను కలిసిన దూదేకుల మస్తానయ్య

విశాలాంధ్ర-మార్కాపురం : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావును శుక్రవారం టిడిపి టిఎన్‌టియుసి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ దూదేకుల మస్తానయ్య మర్యాదా పూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీతో ఎమ్మెల్యేగా గెలుపొందిన శాసనసభ్యులు పల్లాకు ఆయన శాలువ కప్పి అభినందించారు. అనంతరం పార్టీ కార్యాలయంలోనే రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్చార్జి టి.డి.జనార్దన్‌ను కూడా కలిశారు. మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి నాయకత్వంలో పనిచేస్తూ ఆయన ముఖ్య అనుచరునిగా, శిష్యునిగా కొనసాగుతున్నానని వారికి తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దూదేకుల గురవయ్య, గంజి వెంకటేశ్వరరెడ్డి, దూదేకుల పేరయ్య, డి.మస్తాన్, డి.కాసిం, అల్లూరయ్య, తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్తుల తోడ్పాటు అభినందనీయం

విశాలాంధ్ర-సీఎస్‌పురం : విద్యాభివృద్ధికి గ్రామస్తుల తోడ్పాటు అభినందనీయమని, భవిష్యత్తులో కూడా పాఠశాల అభివృద్ధికి గ్రామ పెద్దలు సహకరించాలని ఆర్వేపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి రామకృష్ణ తెలియజేశారు. శుక్రవారం ఆర్వే పల్లి పాఠశాలలో గ్రామ పెద్దలు చల్లా పెద్ద మాల్యాద్రి కుమారులు మనోజ్, మధు పాఠశాలలోని విద్యార్థినీ విద్యార్థులకు నోట్ బుక్స్‌ను బహుకరించారు. గ్రామ పెద్దలు కాకు చెంగలయ్య, కడప శీను, గోవిందమ్మ, కాకు సుబ్బారావు, నాలి రామ్మోహన్రావు, పాఠశాల ఉపాధ్యాయులు గూడల హరిబాబు, జె ఐశ్వర్య, టి ఎబ్బిబా పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బీవీ.రంగారావుకు గాయాలు

విశాలాంధ్ర-గిద్దలూరు : గురువారం అర్ధరాత్రి నరసరావు పేట నుండి కోర్టు పనిమీద స్వగ్రామం గిద్దలూరుకు కారులో వస్తున్న పల్నాడు జిల్లా వైద్య విధాన పరిషత్ హాస్పిటల్స్ జిల్లా కో ఆర్డినేటర్‌గా పనిచేస్తున్న డాక్టర్. బి.వి.రంగారావు అనంతపురం-విజయవాడ రహదారిపై గిద్దలూరు సమీపంలో చెర్లోపల్లి (రాచర్ల మండలం) వద్ద కారు అదుపుతప్పి బోల్తా కొట్టిన ప్రమాదంలో డాక్టర్ రంగరావుకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఆయనను గిద్దలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ఆయనను పరీక్షించిన వైద్యులు ఆయనకు ఎడమ చేయి భాగంలో ఫ్రాక్చర్, పక్కటెముకలు కూడా కొంత విరిగిన కారణంగా ఊపిరితిత్తులకు ఇబ్బందిగా మారి ఆయన కొంత శ్వాస తీసుకోవడంలో సమస్య ఎదురవడంతో ప్రథమ చికిత్స చేశారు. డాక్టర్. రంగారావును ఆయన కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలు మెడికవర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు తరలించారు. ప్రస్తుతం డా.రంగారావును మెడికవర్ ఆస్పత్రి వైద్యులు ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నట్లు సమాచారం. కాగా డాక్టర్ రంగారావు గతంలో గిద్దలూరు, కంభం, మాచర్ల, బాపట్ల ప్రభుత్వ వైద్యశాలలకు సూపరింటెండెంట్‌గా పనిచేశారు.

జీ సినిమాలు, జీ తెలుగులో వీకెండ్ వినోదం

విశాలాంధ్ర - ఒంగోలు: తెలుగు టెలివిజన్ ఇండస్ట్రీలో అత్యంత ఆదరణ గల రెండు ఛానళ్లు జీ తెలుగు, జీ సినిమాలు తమ ప్రేక్షకులను అలరించడానికి మరోసారి సిద్ధమయ్యాయని సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో పాల్గొన్నారు. జులై 20 శనివారం సాయంత్రం 6 గంటలకు జీ సినిమాల్లో డీడీ రిటర్న్స్ (భూతాల బంగ్లా), జులై 21 ఆదివారం సాయంత్రం 6 గంటలకు జీ తెలుగులో గామి వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్‌గా ప్రసారం కానుంది. ఈ సినిమా కథ దశాబ్దాల క్రితం పాండిచ్చేరి శివార్లలోని ఒక రాజభవనంలో ప్రారంభమవుతుంది. వినోదంలో భాగంగా గామి సినిమా ఆదివారం ప్రసారం కానుంది. 'గామి' కథ మానవ స్పర్శ కారణంగా మూర్ఛపోయే అరుదైన సమస్యతో బాధపడుతున్న శంకర్ (విశ్వక్సేన్) అనే అఘోరా చుట్టూ తిరుగుతుంది. విశ్వక్సేన్, చాందినీ చౌదరి నటన మరిచిపోలేని అనుభూతినిస్తుంది. కామెడీతోపాటు సస్పెన్స్ థ్రిల్లింగ్ ఫీల్ని పొందాలంటే ఈ వారాంతంలో జీ సినిమాలు, జీ తెలుగు తప్పనిసరిగా చూడాలన్నారు.

కస్తూర్బా పాఠశాల విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-వెలిగండ్ల : మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ట్రిబుల్ ఐటీ సాధించిన విద్యార్థినికి ఎంఈఓ-1 ఎంఈఓ-2 దాసు ప్రసాద్ రామిరెడ్డి శాలువాతో సన్మానించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు వారి సామర్థ్యాన్ని పరీక్షించుకునేందుకు ఇటువంటి కాంపిటేటివ్ పరీక్షలలో సీట్లు సాధించినప్పుడు వారి సృజనాత్మకత బయటకు వస్తుందని వారు తెలిపారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరినప్పుడు వారి తల్లిదండ్రులు సమాజంలో గౌరవాన్ని పొందుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎస్ ఓ శ్రీరామ్ సుశీల ఉపాధ్యాయినిలు పాల్గొన్నారు.

కేజీబీవీ పాఠశాల తనిఖీ

విశాలాంధ్ర-వెలిగండ్ల : విద్యార్థినిలకు ఉపాధ్యాయునిలో నాణ్యమైన విద్యను కేజీబీవీ పాఠశాలలో అందించాలని జిసిడిఓ అధికారిని మాధవి లత సూచించారు. శుక్రవారం మండలంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను ఆమె అకస్మాత్తుగా తనిఖీ నిర్వహించారు. ఆమె విద్యార్థుల నైపుణ్యతను పరీక్షించారు. అనంతరం ఉపాధ్యాయునీలతో సమావేశం నిర్వహించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. ఈ క్రమంలో పాఠశాల రికార్డులను పరిశీలించి పాఠశాల వసతిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఓ శ్రీరాం సుశీల ఉపాధ్యాయినిలు పాల్గొన్నారు.

గర్భిణులు రక్తశాతం పెంపొందించుకోవాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : గర్భవతులు బలమైన ఆహారం తీసుకొని రక్త శాతాన్ని పెంపొందించుకోవాలని జిల్లా అధికారిని సుగుణమ్మ, రాజేశ్వరి అన్నారు. మండలంలోని మారెళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. ముందుగా గర్భవతులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి గర్భవతికి తప్పనిసరిగా యూపీసీ కార్డులో అన్ని వివరాలు పొందుపరచాలన్నారు. ప్రభుత్వ పథకాలైన ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన పథకంలో 5000వేల రూపాయలు, ఆరోగ్య ఆసరా ద్వారా 5000 రూపాయలు, ఆసుపత్రిలో కాన్పు అయితే వేయి రూపాయలు ఇవ్వడం జరుగుతుందని తెలియ జేయలన్నారు. గర్భవతులకు ఏడు లేదా ఎనిమిది గ్రాముల రక్తం ఉండే వారు కాన్పు సమయంలో ఇబ్బందులు పడతారని, పండ్లు పాలు ఆకు కూరలు బలమైన ఆహారం తీసుకొని 13 గ్రాముల రక్తం ఉండే విధంగా సిబ్బంది వారికి అవగాహన కల్పించాలని కోరారు. వైద్యాధికారి సిహెచ్ ప్రవీణ్ కుమార్, కే ఏ రాజు, ఏ అంజమ్మ పాల్గొన్నారు.

సిద్ధమవుతున్న అన్నా క్యాంటీన్

విశాలాంధ్ర-గిద్దలూరు : అన్న క్యాంటీన్ ప్రారంభించేందుకు కసరత్తు ప్రారంభించారు. శుక్రవారం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ఆదేశాల మేరకు అన్న క్యాంటీన్‌ని స్థానిక టిడిపి నాయకులు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి సోద రుడు కృష్ణ కిషోర్‌రెడ్డి పరిశీలించారు. ఆగస్టు 15వ తేదీ నుంచి అన్న క్యాంటీన్ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో అన్నా క్యాంటీన్ భవనానికి మర మ్మతులు చేయడంతో పాటు ఆగస్టు 15కి భవనాన్ని సిద్ధం చేయనున్నారు.

జర్నలిస్టుల నిరసన

విశాలాంధ్ర-గిద్దలూరు : రాజ్యసభ సభ్యుడు వైసిపి నాయకులు విజయసాయిరెడ్డి జర్నలిస్టులపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని జర్నలిస్టులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసన ర్యాలీ నిర్వహించడంతో పాటు గిద్దలూరు ఎమ్మార్వోకు గిద్దలూరు అర్బన్ సీఐ సోమయ్యకు విజయసాయిరెడ్డిపై చర్యలు తీసుకోవాలంటూ జర్నలిస్టులు వినతిపత్రాన్ని సమర్పించారు. జర్నలిస్టుల గౌరవానికి భంగం కల్పిస్తూ విజయసాయిరెడ్డి వ్యవహరించారని స్థానిక జర్నలిస్టులు విజయసాయిరెడ్డిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణపై దృష్టి సారించాలి

ఒంగోలు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ ఏఆర్ దామోదర్

విశాలాంధ్ర-ఒంగోలు : ఒంగోలులోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ సందర్శించిన స్టేషన్ లోని పలు గదులను మరియు రికార్డ్స్‌ను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో వివిధ విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది యొక్క వివరాలు అడిగి తెలుసుకున్నారు. టౌన్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు తీసుకున్న చర్యలను సమీక్షించి ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రణాళికాబద్ధ చర్యలు తీసుకోవాలని, తగినన్ని బారికేడ్స్, ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, టౌన్‌లో రోడ్డు ప్రమాదాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని, త్రిబుల్ రైడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, మోడీపై సైలెన్సర్లపై నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని, ప్రజలకు మరియు వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. రోడ్డు భద్రతా నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ట్రాఫిక్ అధికారులకు సూచించారు. ఎస్పీ వెంట ట్రాఫిక్ సీఐ మాలకొండయ్య, సీఐ రాఘవేంద్ర మరియు సిబ్బంది ఉన్నారు.

ఎస్పీని కలిసిన ఏపీయూడబ్ల్యూజే జిల్లా ప్రతినిధి బృందం

విశాలాంధ్ర-ఒంగోలు : ప్రకాశం జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఏఆర్ దామోదర్‌ను శుక్రవారం ఉదయం జిల్లా పోలీసు శాఖ కార్యాలయంలో ఏపీయుడబ్లూజె జిల్లా కమిటీ ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేసి అభినందనలు తెలపడం జరిగింది. జిల్లాలో శాంతి భద్రతలను మెరుగుపరచేందుకు తమవంతు సహకారాన్ని అందించడం జరుగుతుందని, అలాగే విధి నిర్వహణలో జర్నలిస్టులకు కూడా పోలీసు శాఖ సహకరించాలని యూనియన్ నాయకులు కోరగా, అందుకు స్పందించిన ఎస్పీ తప్పకుండా సహకారం అందించడం జరుగుతుందని అన్నారు. జిల్లాలో శాంతి భద్రతలను కాపాడేందుకు సహకరించాలని జిల్లా ఎస్పీ ప్రజలకు పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ దామోదర్‌ను కలిసిన వారిలో ఏపీయుడబ్లూజె రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ.సురేష్, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.వి సురేష్ కుమార్, యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎన్ వి రమణ, జిల్లా కార్యదర్శి డి. కనకయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ మారెళ్ళ మురళీ,ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు బి.వెంకట రావు,కార్యదర్శి ఇ.శంకర్, కోశాధికారి జయరాం, ఐజేయు సభ్యులు కె.శ్రీనివాస్, యూనియన్ నాయకులు భేతాళము శ్రీనివాసు, పగడాల శ్రీనివాసరావు, ఇస్తేకర్ భాష తదితరులు వున్నారు.

'డెంగీ'పై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-గిద్దలూరు : పట్టణంలో డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షేక్ సుమయ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షేక్ సుమయ మాట్లాడుతూ సకాలంలో సరైన నివారణ చర్యలు తీసుకోకపోతే వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వేగంగా వ్యాప్తి చెందుతాయని ప్రస్తుతం వర్షాకాలం దృష్ట్యా ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వర్షపు నీరును మరియు ఇంట్లో నీటిని ఎక్కువగా నిలువ ఉండకుండా చేయాలని చేతులు ప్రతిరోజు పరిశుభ్రంగా కడుక్కోవాలని పరిశుభ్రంగా ఉంచుకోవడం వలన వ్యాధులను నివారించవచ్చని జ్వరాల పట్ల జాగ్రత్త వహించవద్దని డయేరియా కూడా ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని వర్షాకాలంలో చికున్‌గున్యా, డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఎక్కువ. ప్రజలు సురక్షితంగా ఉంటూ పరిసరాలను పరిశు భ్రంగా ఉంచుకోవాలని, జ్వరం ఎక్కువ రోజులపాటు ఉంటే తప్పనిసరిగా వైద్యులను సంప్రదించాలని వారు చెబుతున్నారు. అవసరమైన మందులను స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్ల దగ్గర అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ రంగ నాయకులు, సూపర్వైజర్ సుధారాణి పాల్గొన్నారు.

విద్యార్థులకు కెరీర్ ఎడ్యుకేషన్‌పై అవగాహన

విశాలాంధ్ర-తర్లుపాడు : మండల కేంద్రమైన తర్లుపాడులోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల వైద్యాధికారిని డాక్టర్ సోనీ ఆధ్వర్యంలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు కెరీర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాంలో భాగంగా శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మండల వైద్యాధికారిని డాక్టర్ వి.సోనీ పాల్గొన్నారు. ఆమె విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే వైద్య రంగం గురించి ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలి అన్నారు వైద్యరంగం అనేది ఆరోగ్యపరంగా ప్రాణాలను కాపాడే వ్యవస్థని ఇది అన్ని వృత్తుల కంటేమోఘం అన్నారు. ఈ వృత్తిని అవలంబించాలనుకునే ప్రతి ఒక్కరూ చిన్నతనం నుండే క్రమశిక్షణతో, పట్టుదలతో, ఒక పథకం ప్రకారం ప్రణాళికలను రూపొందించు కొని విద్యలో రాణించాలన్నారు. అలా సైన్స్ పరంగా ప్రముఖ వైద్య నిపుణుల శిక్షణలో మెలిగి మంచి ప్రావీణ్యం సంపాదించినాడు వైద్యరంగంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవకాశం కలుగుతుందన్నారు. అనంతరం కెరీర్ ఎడ్యుకేషన్ పాఠశాల కోఆర్డినేటర్లు ఎన్ భాగ్యలక్ష్మి, ఏ ఆదిలక్ష్మి, పాఠశాల ప్రధానో పాధ్యాయుడు ముత్తోజు సుధాకర్ మరియు ఉపాధ్యాయులు మండల వైద్యాధికారిని డాక్టర్ సోనీ, ఎం పి హెచ్ ఎస్ నాగేశ్వరములను శాలువలతో సత్కరించారు.

విద్యార్థులకు పుస్తక పఠనం దిక్సూచి

విశాలాంధ్ర-సంతనూతలపాడు : విద్యార్థులు గ్రంథాలయం పాఠ్య పుస్తకాలు పఠనం ఒక దిక్సూచి అని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదిలక్ష్మి అన్నారు. మండల కేంద్రమైన సంతనూతలపాడు గ్రంథాలయంకు గురువారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు చేపట్టారు. కాసు ఆదిలక్ష్మి రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పేరయ్య మాట్లాడుతూ విద్యార్థులకు గ్రంథాలయాలు ఎంతో ఉపయోగపడతాయని ప్రతి ఒక్కవిద్యార్థి గ్రంథా లయానికి పుస్తకాల పఠనం చేయటం వలన విజ్ఞానాన్ని సంపాదించు కోవచ్చునని తెలిపారు. పాఠశాలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రంథాలయ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వెంకటరెడ్డి ఇన్ చార్జి హెడ్ మాస్టర్ ఉమామహేశ్వరి గ్రంథ పాలకుడు కే సత్యనారాయణ పాల్గొన్నారు.

పేద మహిళకు కుట్టు మిషన్ వితరణ

విశాలాంధ్ర-అద్దంకి : రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ ఆధ్వర్యంలో స్థానిక రోటరీ కార్యాలయం నందు శుక్రవారం పట్టణంలోని కొత్తపేటకు చెందిన పేద మహిళ కొల్లిపర లావణ్యకు కుట్టు మిషన్ వితరణ చేశారు. రాజీవ్‌కాలనీలోని మండల పరిషత్ పాఠశాలకు నాలుగు కుర్చీలు బహుకరించారు.కుట్టు మిషన్‌కు ఆర్థిక సాయం అందజేసిన ఆహ్వాన్,రీతూషాలను రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య అభినందించారు.కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి చుండూరి మురళీసుధాకర్,ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు,రోటరీ మాజీ అధ్యక్షులు సందిరెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - రేపల్లె : ఆంధ్రప్రదేశ్ సమాచార హక్కు కమిషనర్ గుంటూరు వారి మౌఖిక ఉత్తర్వులు మేరకు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆదేశాల ప్రకారం సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు రేపల్లె మండల వ్యవసాయ అధికారి విజయ్ బాబు తెలిపారు. ఈనెల 20వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు రేపల్లె మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో సదస్సు జరుగుతుందని రేపల్లె మండలం వ్యవసాయ ఆయన తెలిపారు. ఈ సమావేశానికి రేపల్లె మండలంలోని అధికారులు సిబ్బంది హాజరు కావలసిందిగా విజ్ఞప్తి చేశారు.

కొమ్మమూరు కెనాల్ గండ్లు పూడ్చిన తెలుగు తమ్ముళ్లు

- పోతుకట్ల నేతలకు ఎమ్మెల్యే ఏలూరి అభినందనలు

విశాలాంధ్ర - పర్చూరు : వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురైన కొమ్మమూరు కాలువ గండ్లను పూడ్చేందుకు తెలుగు తమ్ముళ్లు కదిలారు.మండలంలోని పోతుకట్ల సమీపంలోని కొమ్మమూరు కెనాల్‌కు పలుచోట్ల గండ్లు పడ్డాయి.ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో సాగుకు సన్నద్ధమవుతున్న తరుణంలో నీటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు గండ్లను ఇసుక బస్తాలు,మట్టిని తీసుకువచ్చి కట్టలను పటిష్టపరిచారు.దీంతో ఆ ప్రాంత రైతులు ఆనంద వ్యక్తం చేశారు.గండ్లను పూడ్చి పొలాలను వరదనీటితో ముంచేత్తకుండా కాపాడిన పోతుకట్ల తెలుగుదేశం పార్టీ నాయకులను,కార్యకర్తలను పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు అభినందించారు.పోతుకట్ల మాజీ సర్పంచ్ మానం హరిబాబు చూపిన చొరవను ఎమ్మెల్యే ఏలూరి ప్రశంసించారు.

బియ్యం,కందిపప్పు ప్రత్యేక కౌంటర్ ప్రారంభం

విశాలాంధ్ర - నిజాంపట్నం : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పేద ప్రజలకు తక్కువ ధరలకు బియ్యం,కందిపప్పు అందించడానికి ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసిందని మంత్రి అనగాని సోదరుడు,టీడీపీ నాయకులు అనగాని శివప్రసాద్ అన్నారు.మండల కేంద్రమైన నిజాంపట్నంలో ఏర్పాటు చేసిన బియ్యం,కందిపప్పు ప్రత్యేక కౌంటర్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ మార్కెట్‌లలో బియ్యం,కందిపప్పు ధరలు అధికంగా ఉన్నాయన్నారు.ప్రజలకు తక్కువ ధరలకు బియ్యం,కందిపప్పును విక్రయించేందుకు ప్రభుత్వ ఆదేశాలు మేరకు నిజాంపట్నంలో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ఈ కౌంటర్లో నాణ్యమైన బియ్యం కేజీ రూ.49, కందిపప్పు కేజీ రూ.160 కే విక్రయిస్తున్నట్లు చెప్పారు.ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.అనంతరం చేయూత మహిళా మార్టును సందర్శించి నిత్యవసర వస్తువులు,రికార్డులను పరిశీలించారు. అలాగే నిజాంపట్నం హార్బర్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను అయన పరిశీలించారు.ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు నర్రా సుబ్బయ్య,టీడీపీ సీనియర్ నాయకులు బొమ్మిడి రామకృష్ణ, కేసన రామకృష్ణ, తాతా ఏడుకొండలు,టీడీపీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ వైద్యమే లక్ష్యంగా సేవలు

రాయపాటి మమత

విశాలాంధ్ర - మార్టూరు : పేదలకు మెరుగైన కార్పొరేట్ వైద్యమే లక్ష్యంగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని, ఇందుకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధతో చూపుతున్న ప్రోత్సాహం మరువలేనిదని ఆస్టర్ రమేష్ హాస్పిటల్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ రాయపాటి మమత పేర్కొన్నారు.శుక్రవారం ఎమ్మెల్యే ఏలూరి క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రముఖ పారిశ్రామికవేత్త లాయిడ్ ఫార్మా ఎండి విక్రమ్ నారాయణ,డాక్టర్ ఎలవర్తి కార్తీక్‌లతో కలిసి ఆమె మాట్లాడారు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సారథ్యంలో ఏలూరి చారిటబుల్ ట్రస్ట్,ఆస్టర్ రమేష్ ఒంగోలు హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 21న చిన్న గంజాం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్లో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ క్యాంపు నిర్వహించడం జరుగుతుందన్నారు.అపార అనుభవం కలిగిన కార్డియాలజీ,న్యూరాలజీ, పల్మనాలజీ,ఆర్థోపెడిక్,జనరల్ మెడిసిన్, విభాగాల ప్రముఖ వైద్యులతో పాటు 180 మందికి పైగా వైద్య సిబ్బంది సేవలందిస్తారని పేర్కొన్నారు. ప్రజలకు మంచి చేయాలనే ధోరణితో ఎమ్మెల్యే ఏలూరి నియోజకవర్గంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారన్నారు.గతంలో నియోజకవర్గంలో క్యాంపులు ఏర్పాటు చేశామని ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు.వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులు అందిస్తామని పేర్కొన్నారు.వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు.ప్రస్తుతం తరుణంలో ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు అవసరమని పరీక్షల నేపథ్యంలో అనేక వ్యాధులు బయటపడుతున్నాయని ఆమె తెలిపారు.ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని వైద్య శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు. యువ పారిశ్రామికవేత్త విక్రమ్ నారాయణ లాంటి వ్యక్తులు గ్రామాలకు సేవ చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు.ఈ సమావేశంలో టీడీపీ మార్టూరు మండల అధ్యక్షుడు తాటి నాగేశ్వరరావు, ఇంకొల్లు మండల అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు, యద్దనపూడి మండల అధ్యక్షుడు రంగయ్య చౌదరి,పర్చూరు మండల అధ్యక్షుడు షేక్ శంషుద్దీన్, కారంచేడు మండల అధ్యక్షుడు శ్రీహరి, తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ ఉపాధ్యక్షుడు తొండెపు ఆదినారాయణ, డాక్టర్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వైద్యాధికారి డాక్టర్ పి.శ్రీహర్ష

విశాలాంధ్ర - యద్దనపూడి : ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రత్యేక దృష్టి సారించాలని వైద్యాధికారి డాక్టర్ పి.శ్రీహర్ష అన్నారు.మండలంలోని చింతపల్లి పాడు గ్రామంలో ఫిక్సుడ్ డే ప్రోగ్రాంలో భాగంగా కీటక జనిత వ్యాధులైన డెంగ్యూ,చికెన్ గున్యా,మలేరియా, ఫైలేరియా,మెదడు వాపు వ్యాధులు రాకుండా,నీటి కలుషిత వ్యాధులైన కలరా,టైఫాయిడ్,నీళ్ల విరోచనాలు,పచ్చకామెర్లు లాంటి వ్యాధులు రాకుండా జాగ్రత్త పడాలన్నారు.వారానికి మించి నీరు నిల్వలు లేకుండా చేయటం,తాగునీటి వనరులను క్లోరినేషన్ చేయటం,ఎవరైనా జ్వరంతోగాని విరోచనాలతోగాని బాధపడుతున్నట్లయితే మీ గ్రామాలలోని ఆశాలకు గాని వైద్య సిబ్బందికిగాని తెలియజేయాలని కోరారు.అలాగే జాతీయ కుష్టు నివారణ కార్యక్రమాన్ని ఈనెల 18వ తేదీ నుండి ఆగస్టు రెండవ తేదీ వరకు నిర్వహిస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఇంటింటికి వచ్చి శరీరంపై ఉండే మచ్చలును గుర్తిస్తారని ప్రజలు వైద్య సిబ్బందికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ తంగెళ్ల శివ ప్రసాద్,షేక్ షర్మిల,శివ నాగరాణి, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ధరకే బియ్యం,కందిపప్పు

విశాలాంధ్ర - వేటపాలెం : గడియారం స్తంభం సెంటర్ నందు ప్రజలకు అందుబాటులో నిత్యవసర వస్తువులు ఏర్పాటుచేసి తక్కువ ధరకే బియ్యం,కందిపప్పు విక్రయాలు చేపట్టినట్లు ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య అన్నారు.బియ్యం కిలో రూ.49, ముడి బియ్యం కిలో రూ.48, దేశీ వాలి కందిపప్పు కిలో రూ.160,చొప్పున విక్రయిస్తున్నట్లు తెలిపారు.సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు రైస్ మిల్లర్ అసోసియేషన్‌ను లాభాల్లో కొంత తగ్గించుకుని తక్కువ ధరకు బియ్యం, కందిపప్పు ఇవ్వటం అభినందనీయమన్నారు. ఎక్కడైనా అక్రమ నిలువలు కృత్రిమ కొరత సృష్టిస్తే ఉక్కు పాదం మోపుతానని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన,బిజెపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టం పౌరుల చేతిల్లో పాశుపతాస్త్రం

న్యాయవాది బత్తుల రామకోటయ్య

విశాలాంధ్ర-అద్దంకి: సమాచార హక్కు చట్టం అనేది పౌరుల చేతిలో పాశుపతాస్త్రం అని న్యాయవాది బత్తుల రామకోటయ్య అన్నారు. సమాచార హక్కు చట్టం కమీషనర్ ఆదేశాల మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయం నందు శుక్రవారం మండలస్థాయి అధికారులకు,ప్రజలు మరియు గ్రామస్థాయి అధికారులకు సమాచార హక్కు చట్టంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిధిగా హాజరైన న్యాయవాది బత్తుల రామకోటయ్య మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం పౌరుల చేతిలో పాశుపతాస్త్రం లాంటిదని ప్రజలకు ఉపయోగపడే ప్రతి సమాచారాన్ని పొందే హక్కు ఈచట్టం కల్పించిందని తెలిపారు.దరఖాస్తుదారునికి సమాచారం 30 రోజుల్లో ఇవ్వాలని లేనియెడల పైఅధికారులకు ఫిర్యాదు చేయవచ్చన్నారు.కార్యక్రమంలో పాల్గొన్న మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ మాట్లాడుతూ ఏప్రభుత్వ కార్యాలయం నుండైనా సమాచారాన్ని పొందే అధికారం పౌరులకు సమాచార హక్కు చట్టం కల్పించిందన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ సుభాని, ఎంఈవో గంగాధర్,డిప్యూటి తహశీల్దార్ సుధారాణి, పంచాయతీరాజ్ ఏఇ వెంకటేశ్వర్లు,ఉద్యానశాఖాధికారిణి దీప్తి,వెలుగు ఏపిఎం కోటేశ్వరరావు,ఏపివో గాయత్రి,ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణీలు జాగ్రత్తలు పాటించాలి

విశాలాంధ్ర - చీరాల రూరల్ : గ్రామంలోని గర్భిణీలు,బాలింతలు,కిశోర బాలికలు తగిన జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యంగా ఉండాలని పి. హెచ్ .సి వైద్యులు సిహెచ్ శ్రీదేవి అన్నారు.మండలంలోని ఈపురుపాలెం ఆరోగ్య సబ్ సెంటర్‌ను జిల్లా టాస్క్ ఫోర్స్ సభ్యులతో కలిసి సందర్శించారు. సబ్ సెంటర్‌లోని రికార్డులు తనిఖీ చేశారు.గర్భిణీలు,బాలింతలకు రక్త పరీక్షలు నిర్వహించారు.సీజనల్ వ్యాధుల పట్ల వారికి అవగాహన కల్పించారు. జిల్లా టాస్క్ ఫోర్స్ సభ్యులు, సిబ్బంది,గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

పోస్టు ఆఫీసులో మోసపోయిన

ఖాతాదారులకు నగదు చెల్లించాలి

విశాలాంధ్ర - రేపల్లె : నియోజవర్గం పరిధిలోని నగరం మండలం సిరిపూడి పోస్టు ఆఫీసులో డబ్బులు జమచేసి మోసపోయిన ఖాతాదారులకు తిరిగి నగదు చెల్లించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్.మణిలాల్ డిమాండ్ చేశారు.మణిలాల్ మాట్లాడుతూ సిరిపూడి పోస్ట్ ఆఫీస్ పరిధిలో జరిగిన అవినీతిపై అధికార యంత్రాంగం సరైన పద్ధతుల్లో స్పందించి బాధితులకు తిరిగి డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు.గత పదిసంవత్సరాల కాలం నుండి ఇక్కడ పోస్ట్ ఆఫీస్‌లో ఉద్యోగి సుమారు 700 ఖాతాదారులుగా రూ.50లక్షలు వరకు డిపాజిట్లు,నెలవారి పొదుపు చెల్లిస్తున్నప్పటికీ వాటిని సక్రమంగా డిపాజిట్ చేయకుండా,ఆన్లైన్ చేయకుండా సొంతానికి వాడుకొంటు అవినీతికి పాల్పడుతుంటే ఎందుకుపై స్థాయిలో ఉన్న పోస్టల్ అధికారులు సిరిపూడి పోస్ట్ ఆఫీస్ నుంచి జమలు కావడంలేదు,రివ్యూ నిర్వహించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు.మోసంచేసినా వ్యక్తిపారిపోకముందే ఈ వ్యవహారం బయటకు వచ్చినప్పటికీ కొంతమంది డబ్బులు తిరిగి కట్టించి చేతులు దులుపుకున్నారన్నారు.జిల్లా స్థాయిలో పోస్టల్‌పై అధికారులకి కానీ,పోలీస్‌లకి గాని కంప్లైంట్ చేయకుండా మౌనంగా ఎందుకు ఉన్నారన్నారు.ఇప్పుడు మోసం చేసినా ఉద్యోగి కనపడట్లేదు, డిపార్టుమెంట్ ఎంక్వయిరీ చేస్తున్నమూ అతను వస్తేనే డబ్బులు తిరిగి చెల్లిచెంది అన్నట్లు పోస్టల్ అధికారులు వ్యవహరిస్తున్నారని బాధితులు వాపోతున్నారు.బాధితులకు భరోసా కల్పించాలంటే త్వరితగతినా ఎంక్వయిరీ పూర్తి చేయాలన్నారు.పేదల కష్టపడి దాచుకున్న ప్రతి రూపాయి తిరిగి వెనక్కి ఇవ్వాలి,అప్పటివరకు సిరిపూడి పోస్టల్ బాధితుల కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కే.రమేష్,పోస్ట్ ఆఫీస్‌లో నగదు చెల్లించి మోసపోయిన బాధితులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు చేపట్టాలి

విశాలాంధ్ర - చీరాల రూరల్ : మండలంలోని అన్ని గ్రామ పంచాయితీలలో ప్రత్యేక పారిశుధ్య చర్యలు తీసుకోవాలని డీఎల్‌పీఓ దారా హనుమంతరావు పంచాయితీ కార్యదర్శులను ఆదేశించారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై మైకు ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మురుగు నీరు నిలువ లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు.గ్రామంలో పర్యటించి మురుగు నీరు బయటకు వెళ్లేలా చూడాలని,నీటి నిల్వలు ఉన్న చోట ఆయిల్ బాల్స్ వేయాలని,తడి చెత్త,పొడిచెత్తలను వేరు చేసి ఎస్ డబ్ల్యుపీసీలకు పంపాలన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను తగుల బెడితే శ్వాస కోశ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని,రోడ్డుకు ఇరువైపులా వేస్తే వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కాచి చల్లార్చిన నీటిని తాగాలని,ఇంటిలోను,పరిసరాల్లోనీరు నిలువ లేకుండా చూడాలన్నారు.బ్లీచింగ్ చల్లించాలని,మంచి నీరు కలుషితం కాకుండా చూడాలని,సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తూ పర్యవేక్షించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఈఓ పీఆర్ అండ్ ఆర్డీ బండారు మురళీ బాపూజీ తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూ వ్యాధిపై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర - రేపల్లె : మండలంలోని మోళ్ళగుంట గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవ కార్యక్రమం నిర్వహించారు.శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా ప్రజలకు దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల గురించి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మోళ్ళగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డాక్టర్ సాయి మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతోనే డెంగ్యూ వ్యాధిని నివారించగలమని,ప్రజలందరూ తప్పనిసరిగా ఇంటి పరిసరాలలోని వ్యర్థాలను,కృత్రిమ నీటి నిల్వలను తొలగించి దోమలు అభివృద్ధి చెందకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.వర్షాకాలం మొదలైంది, వర్షపు నీరు నిల్వలు ఏర్పడి దోమలు వృద్ధి చెందుతాయన్నారు.దోమల వృద్ధిని అరికట్టాలని,వాటిపై యుద్ధం ప్రకటించాలన్నారు.వ్యర్థ నీటి నిల్వలను మట్టితో పూడ్చాలనీ,మురుగు నీటి కాలువలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.మంచి నీటి నిల్వలను వారానికి ఒకసారి తొలగించి ఎండబెట్టి ఫ్రైడే డ్రై డే పాటించాలన్నారు.దోమలు పెరగకుండా పరిసరాల్ని శుభ్రపరచి,దోమలార్వా నివారణ మందులను పిచికారి చేయాలనీ, తద్వారా దోమల వృద్ధిని అరికట్టవచ్చన్నారు.దోమలు కుట్టకుండా ప్రజలందరూ తప్పనిసరిగా శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచే దుస్తులను ధరించాలన్నా రు.దోమకాటుకు గురి కాకుండా ఉండాలని,ఇంటి కిటికీలకు దోమలు రాకుండా మెష్‌లు కట్టుకోవాలని,ఇంటి పరిసరాలలో వృధాగా పడవేసిన టైర్లు,కొబ్బరి బొండాలు,పగిలిన కుండలు,వాడని కూలర్లు,ప్లాస్టిక్ గ్లాసులు,వాడని రోళ్ళు,తొలగించాలన్నారు.దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు ముఖ్యంగా డెంగ్యూ,మలేరియా,చికెన్ గున్యా వ్యాధులను ముందుగా గుర్తించాలని ఆరోగ్య సిబ్బందినీ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రావణ్య,సూపర్వైజర్లు వైవి రావు,రంగారావు,ప్రేమ కుమారి,ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

21న బీఆర్ అంబేద్కర్ విగ్రహా ఆవిష్కరణ

బహుజన కెరటాలు వ్యవస్థాపకుడు పల్నాటి శ్రీరాములు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : ఈనెల 21న పిట్టలవానిపాలెంలో జరిగే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ ఉత్సవానికి తరలి రావాలని బహుజన కెరటాలు వ్యవస్థాపకుడు పల్నాటి శ్రీరాములు పేర్కొన్నారు.దక్షిణాంధ్ర ప్రదేశ్‌లోనే మొట్ట మొదటిసారిగా సింహాసనంపై కూర్చున్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని జూలై 21 ఆదివారం పిట్టలవానిపాలెం మండల కేంద్రం నందు బాబా సాబ్ అంబేద్కర్ మనుమడు ఆనంద్ రాజ్ యశ్వంత్ అంబేద్కర్ ఆవిష్కరించెదరని పల్నాటి శ్రీరాములు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్,బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ,బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్,వేమూరు ఎమ్మెల్యే నక్క ఆనంద బాబు,ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్,మాజీ కేంద్రమంత్రి పనబాక లక్ష్మి ,ప్రజా యుద్ధ నౌక గద్దర్ కుమారుడు సూర్య కిరణ్ తదితరులు పాల్గొంటున్నారన్నారు.డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి జిల్లాను నలుమూలల నుండి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.శుక్రవారం బాపట్లలోని అంబేద్కర్,రమాబాయి విగ్రహాల వద్ద ఈ కార్యక్రమం కరపత్రాన్ని ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల,పార్టీల నాయకులు కాగిత కోటేశ్వరరావు,గుదే రాజారావు,దేవరకొండ రాము,తమలపాకుల భాస్కరరావు,సలగల చంటి బాబు,రవి రాజు,ఎస్.ఎం రాజు,నల్లమోతు శామ్యూల్ జాన్సన్,దయా బాబు ఎలీషమ్మ,అరుణ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ కేంద్రంను సందర్శించిన కమిషనర్

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : పట్టణంలోని మూర్తి రక్షణ నగర్ వద్ద గల మంచినీటి ఫిల్టరేషన్ ప్లాంట్ కేంద్రం మున్సిపల్ కమిషనర్ నిర్మల కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ.ఎల్.ఎస్.ఆర్ మంచినీటి ట్యాంక్‌లో ఉన్న నీటిని పరీక్షించారు. అనంతరం సిబ్బందిని విషయాలు అడిగి తెలుసుకున్నారు.

డిపిఓ శివప్రసాద్‌కి కమిషనర్ నివాళి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : బాపట్ల పురపాలక సంఘం కార్యాలయంలో డిపిఓగా విధులు నిర్వహిస్తూ అనారోగ్య కారణంగా మరణించిన జంపని శివప్రసాద్ మృత దేహానికి మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.శివప్రసాద్ కుటుంబానికి సంతాపం తెలియజేసి ధైర్యం చెప్పి పురపాలక సంఘం కార్యాలయం సిబ్బంది సహకారంతో రూ.25,000 కుటుంబ సభ్యులకు అందజేశారు.

కలెక్టర్‌ని కలిసిన మేధ శ్రీనివాసరావు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : బాపట్ల జిల్లాకు బదిలీపై వచ్చిన కలెక్టర్ జే.వెంకట మురళి,ఎస్పీ తుషార్ డూడి,జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు, మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్‌లను శుక్రవారం సమాజవాది పార్టీ జిల్లా అధ్యక్షుడు మేధ శ్రీనివాసరావు వారి ఆఫీసులలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.నూతనంగా ఏర్పడిన జిల్లా అభివృద్ధి పదంలో నడిచే విధంగా విద్యాపరంగా ప్రముఖ కేంద్రంగా విలసిల్లుతున్న బాపట్లను ఉపాధి కేంద్రంగా వ్యాప్తి చెందటానికి కృషి చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సమాజవాది పార్టీ నాయకులు విలియం బూత్ కళాశాల ప్రిన్సిపల్ దాసరి శ్యామ్ లివింగ్ స్టన్,సీనియర్ అడ్వకేట్ లంబు సాంబయ్య,అధ్యాపకులు మోర్ల చిన వెంకటేశ్వరరావు, కంద్రా శరత్ కుమార్,కొమ్మన బోయిన ఫణీంద్ర, బోయిన సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

హత్య రాజకీయాలకు పేటెంట్ వైసీపీదే

- మంత్రి గొట్టిపాటి రవికుమార్

విశాలాంధ్ర - అద్దంకి : చంద్రబాబు వద్ద జగన్ ఆటలు సాగవు అని అద్దంకి ఎమ్మెల్యే రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రివర్యులు గొట్టిపాటి రవికుమార్ అన్నారు.శుక్రవారం పత్రిక ప్రకటన ద్వారా మంత్రి మాట్లాడుతూ వినుకొండలో వ్యక్తిగత కక్షలతో హత్య జరిగితే దానిని ప్రభుత్వానికి ఆపాదిస్తారా అని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ధ్వజమెత్తారు. వివాదాన్ని రెచ్చగొట్టేందుకు వైసీపీ అధినేత జగన్ వినుకొండలో పర్యటిస్తున్నారన్నారు. హత్య రాజకీయాలకు పేటెంట్ వైసీపీదే అని విమర్శించారు. నిందితులు ఎవరైనా కూటమి ప్రభుత్వం ఉపేక్షించదని,పోలీసులు చట్టప్రకారం చర్యలు తీసుకుంటారన్నారు.చంద్రబాబు వద్ద జగన్ ఆటలు సాగవని తెలుసుకోవాలని హితవు పలికారు.

ఎస్సీ,ఎస్టీ కేసు బాధితులకు బాసటగా నిలవండి

- కలెక్టర్‌కు గుదే రాజారావు విన్నపం

విశాలాంధ్ర - బాపట్ల : ఎస్సీ,ఎస్టీ కేసుల బాధితులకు బాసటగా నిలిచి అందవలసిన పరిహారం ఉద్యోగం త్వరితగతిన కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకట మురళిని ఎస్సీ,ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గుదే రాజారావు విజ్ఞప్తి చేశారు.కలెక్టరేట్లో శుక్రవారం జరిగిన ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో గుదే రాజారావు మాట్లాడుతూ బాపట్ల పట్టణంలో రైతు బజారు ఎదురు స్థలంలో ఎస్సీ కార్పొరేషన్ నిర్మించిన షాపులలో బీసీలు,ఓసీలు,మైనార్టీలు,అక్రమంగా జొరబడి ఆక్రమించుకొని ఎస్సీ,ఎస్టీలకు అన్యాయం చేశారని తెలిపారు.ఎస్సీ,ఎస్టీ బ్యాక్లాగ్ పోస్టులు నియమకాలు చేయాలని ఎస్సీ,ఎస్టీ కేసులలో స్టేషన్ బెయిలు రద్దు చేయమని కోరారు. చీరాల మండలం దేవుని నూతల గ్రామంలో ఎస్సీ కాలనీలో ఉన్న అంగన్వాడి స్కూలు దగ్గర టాయిలెట్లు కట్టనీకుండా బీసీ కమ్యూనిటీ వారు ప్రభుత్వ భూమి ఆక్రమించుకోవడం జరిగిందన్నారు.ఎస్సీలకు కేటాయించిన స్మశాన భూమిలో అక్రమంగా బీసీలు ఆక్రమించుకొని ఇల్లు షాపింగ్ నిర్మించుకోవడం జరిగిందని అక్కడున్న ఎస్సీలను భయభ్రాంతులకు గురి చేయటం జరిగిందని పూర్తిస్థాయిలో విచారణ చేసి బాధితులకు న్యాయం చేయాలని చట్టాన్ని అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సమాచార హక్కు చట్టంపై అధికారులకు శిక్షణ

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని,ప్రభుత్వ సమాచారం అడగడం ప్రతి ఒక్కరి హక్కు అని బాపట్ల సహాయ వ్యవసాయ సంచాలకులు ఏ.లక్ష్మి అన్నారు.శుక్రవారం మండలంలోని స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చావలి సునీల్ రాష్ట్ర సమాచార కమిషనర్ ఆదేశాల మేరకు సమాచార హక్కు చట్టంపై ప్రజలకు, అధికారులకు,అనధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని చెప్పారు.ఈ సమాచార హక్కు చట్టం 2005 గురించి క్లుప్తంగా చెప్పడానికి బాపట్ల జిల్లా డిపిఐసి డిపార్ట్మెంట్ ఇమాన్యుల్ ఏ విధంగా ఈ సమాచార హక్కు చట్టం ఉపయోగపడుతుంది ఎన్ని రోజుల్లో దేనికి ఏ విధమైన రిప్లై ఇస్తారు అర్జీలను ఏ విధంగా పరిష్కరించాలి అనే దానిపై వివరించారు.ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో వరి నారుమల్లు ఎదబెట్టిన పంట గురించి వివరంగా చెప్పడం జరిగిందన్నారు.డాక్టర్ ఉష వరిలో కలుపు యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సిహెచ్ సత్యనంద్ రైతులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి షార్ట్ ఫిల్మ్ పోటీలకు 'కొండమ్మ'

విశాలాంధ్ర-తాడేపల్లి : ప్రముఖ కవి దాశరథి శతజయంతి సందర్భంగా దాశరథి ఫిల్మ్ సొసైటీ హైదరాబాద్ వారు నిర్వహిస్తున్న జాతీయ స్థాయి తెలుగు షార్ట్ ఫిలిమ్ పోటీలకు త్రినేత్ర ప్రొడక్షన్స్ ఉండవల్లి వారి 'కొండమ్మ' షార్ట్ ఫిల్మ్స్ ఫైనల్ స్క్రీనింగ్‌కు ఎంపికైనట్లు త్రినేత్ర ప్రొడక్షన్స్ అధినేత, రచయిత, దర్శకులు గాదె నాగభూషణం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ఈ పోటీలకు వచ్చిన షార్ట్ ఫిల్మ్స్ అన్నిటినీ స్క్రూటినీ చేసిన అనంతరం ఆరు షార్ట్ ఫిల్మ్‌లను ఫైనల్ స్క్రీనింగ్‌కు న్యాయనిర్ణేతలు ఎంపిక చేశారని, ఈ ఫైనల్ స్క్రీనింగ్‌లో 'కొండమ్మ'కు స్థానం దక్కిందని నాగభూషణం తెలిపారు. ఈ నెల 21న సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని మెయిన్ ఆడిటోరియంలో ఫైనల్స్‌కు ఎంపికైన షార్ట్ ఫిల్మ్‌ల ప్రదర్శన జరుగుతుందని, అనంతరం విజేతలకు బహుమతి ప్రధానోత్సవం జరుగుతుందని చెప్పారు.

నేడు సమాచార హక్కు చట్టంపై అవగాహన

విశాలాంధ్ర - కొరిశపాడు : మండల కేంద్రంలో సమాచార హక్కు చట్టం 2005పై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార శాఖ ఆదేశాలను అనుసరించి మండల స్థాయి అధికారులకుప్రజలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుందని మండల స్థాయి అధికారులు తెలిపారు.

వాహన చోదకులు హెల్మెట్ ధరించాలి

విశాలాంధ్ర - చీరాల : ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికార సంస్థ చీరాల ఆధ్వర్యంలో స్థానిక కొత్తపేట లోని నారాయణ ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు.ప్రతి ఒక్క ద్విచక్ర వాహన చోదకుడు హెల్మెట్‌ని కచ్చితంగా ధరించాలని, తద్వారా ప్రమాద సమయంలో ప్రాణాపాయ స్థితి నుండి రక్షణ పొందడమే కాకుండా భారీ జరిమానాల బారిన పడకుండా రక్షణ పొందవచ్చునని అన్నారు.మారిన నూతన చట్టాలను అనుసరించి హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపే వారికి జరిమానాలు భారీగా ఉంటాయని, ఐ.ఎస్. ఐ మార్క్ ఉన్న హెల్మెట్‌నే ధరించాలని,ఇంట్లోని పెద్దలు ఎవరైనా హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడపడానికి సమాయత్తమైతే దానివల్ల జరగబోయే అనర్థాల గురించి వారికి తెలియజెప్పి జరగబోయే అపాయాల నుండి వారిని రక్షించాలని తెలిపారు. మైనర్లు డ్రైవింగ్ చేయటం,బైక్ రేసులు, ట్రిపుల్ రైడింగ్,డ్రంక్ అండ్ డ్రైవ్‌లో, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయటం,నిర్లక్ష్యంగా వాహనాలు నడపటం,తదితరాలు నేరాలు కావున వాటి నుండి దూరంగా ఉండాలని తెలిపారు.యువత చట్టానికి అనుగుణంగా ప్రవర్తిస్తూ, క్రమశిక్షణతో మెలగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో చీరాల బార్ అసోసియేషన్ మహిళా ప్రతినిధి జీకే ఈశ్వరి రెడ్డి,అడ్వకేట్ బి.రామారావు, సోషల్ వర్కర్ కంపిఎల్లి యస్. డిమతీన్,నారాయణ ఉన్నత పాఠశాల ప్రిన్సిపల్,అధ్యాపకులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన ఉండాలి

వ్యవసాయ అధికారి టి.బాలాజీ గంగాధర్

విశాలాంధ్ర - చెరుకుపల్లి : సమాచార హక్కు చట్టం ద్వారా ప్రభుత్వం చేయవలసిన పనులు ప్రజలు పొందవలసిన సేవలు గురించి సమగ్ర సమాచారం తెలుసుకునే వీలుందని మండల వ్యవసాయ అధికారి టి.బాలాజీ గంగాధర్ అన్నారు.శుక్రవారం అయినా ఆరుంబాక రైతు సేవా కేంద్రంలో మధ్యాహ్నం సమాచార హక్కు చట్టం 2005 అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సమాచార కమిషనర్ చావలి సునీల్ మౌఖిక ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమానికి మండల అభివృద్ధి అధికారి శ్రీనివాస్ మూర్తి మాట్లాడుతూ అవినీతి నియంత్రణ ప్రభుత్వాలను వాటి సాధనాలను ప్రజలకు జవాబుదారీగా ఉంచటం విజ్ఞానవంతమైన చైతన్యవంతమైన పౌర సమాజం తదితర అంశాలు ప్రజలు ఈ చట్టం ద్వారా తెలుసుకునే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ సేవల గురించి ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఈ ప్రజలకు కావలసిన సమాచారం ఈ చట్టం ద్వారా అందించే అవకాశం ఉందన్నారు.ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరగకుండా సమాచార హక్కు చట్టం ద్వారా వారికి కావాల్సిన సమాచారాన్ని ఆయా శాఖల ద్వారా పొందే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ శాంతి లక్ష్మి,ఐసిడిఎస్ సూపర్వైజర్ శ్రీనివాసమూర్తి ,కె.వి సుబ్బమ్మ ,వివిధ గ్రామపంచాయతీ కార్యదర్శులు,సచివాలయం సిబ్బంది,అంగన్వాడి కార్యకర్తలు, రైతులు గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

కుటుంబం వ్యవస్థ ప్రపంచానికి ఆదర్శం

శివసేవక్ మహాత్మ వైష్ణోందాస్ శివకరణ్

విశాలాంధ్ర-గిద్దలూరు : భారతదేశంలోని కుటుంబ వ్యవస్థ ప్రపంచానికే ఆదర్శమని శివసేవక్ మహాత్మా వైష్ణోందాస్ శివ కిరణ్ అన్నారు. మహారాష్ట్ర లోని ఫతేపూర్ జిల్లా కరోలి గ్రామం నుండి ఆయన కాశ్మీర్ నుండి కన్యా కుమారి వరకు పాదయాత్ర చేయాలని సంకల్పంతో యాత్ర ప్రారంభించామన్నారు. 2022 మార్చి 25వ తేదీన తాను పాదయాత్ర చేపట్టానని ఇప్పటివరకు 15 వేల కిలోమీటర్లు చెప్పులు లేకుండా నడవడం జరిగిందన్నారు. భారతదేశంలో కుటుంబ వ్యవస్థ సన్నగిల్లిందని, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన సూచించారు. దేశం కోసం పోరాటం చేసిన స్వాతంత్ర సమరయోధులు, దేశం కోసం శ్రమించే ఆర్మీ జవాన్లు, రైతులు, సాధు సత్పురుషులు నిరంతర దేశ సేవలో ఉన్న సంఘ సేవకులు, బ్రహ్మచార్యులు ప్రజలు అందరూ సంతోషంగా ఉండాలన్నారు. చెడు వ్యసనాలకు అలవాటుపడ్డ యువతకు విముక్తి కల్పించి, దేశ ప్రయోజనాల కోసం వారిని అభద్రతాభావంతో ఉన్నవారికి ధైర్యం చెప్పడం భారతదేశంలో పుట్టిన ప్రతి ఒక్కరూ దేశం కోసం సేవ చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. అనంతరం ఆయన పట్టణంలోని రామకృష్ణ మందిరానికి చేరుకున్నారు. ఆయన వెంట ఆర్ట్ ఆఫ్ టీచర్ యోగా టీచర్ బిఎస్ నారాయణరెడ్డి తదితరులున్నారు.

వర్షాలతో పంటలకు మేలు

విశాలాంధ్ర-తాడికొండ : ఈ ఏడాది అనుకున్న సమయానికి వర్షాలు పడ్డాయి. పంట పొలా లు పదునెకటంతో రైతులు పలు రకాల పంటలను సాగు చేస్తున్నా రు. మండలంలో ఇప్పటికే పత్తి, వరి, మినుము, పెసర, నువ్వులు, మిశ్రమ పంటగా కంది సాగు చేస్తున్నారు. కాస్తంత ఆలస్యమైన ఇటీవల నిత్యం వర్షా లు కురుస్తున్నాయి. పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. పంటలకు రైతులు ఎరువు కట్టలను వేస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు పంటలకు మేలు చేస్తున్నాయి.

దళారులకు వరంగా

కౌలు రైతు కార్డులు

విశాలాంధ్ర-మేడికొండూరు : మండలంలో కౌలు రైతు కార్డులు కొందరు దళారీలకు వరంగా మారింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ప్రభుత్వం ఇచ్చే రైతు భరోసా దళారీలకు కాసుల పంట పండిస్తుంది. బడుగు బలహీన వర్గ నిరుపేద కౌలు రైతులకు చెందాల్సిన రైతు భరోసా డబ్బులతో దళారీలు తమ జేబులు నింపుకొని పేదల కడుపు కొడుతున్నారు. వివరాల్లోకి వెళితే మేడికొండూరు మండలంలో కొందరు దళారీలు తమ భూమితో పాటు తమకు తెలిసిన వారి భూమి పాసుపుస్తకాల జిరాక్స్‌లతోపాటు తమ ఆధార్ కార్డు జిరాక్స్‌లు తీసుకొని తమకు అనుకూలంగా ఉన్న వ్యవసాయం చేయని రైతు భరోసాకు లబ్ది చేకూరే వ్యవసాయ కూలీలకు ఒక్కొక్కరికి అరఎకరం, ఎకరా భూమిని కౌలుకు ఇచ్చినట్లు భూ యజమాని సంతకాలు ఫోర్జరీ చేసి కౌలు రైతు కార్డులు ఇప్పిస్తున్నారు. కౌలు రైతు కార్డు పొందాలంటే ఒక ఎకరం ఉండాలన్న నిబంధనలను తుంగాలో తొక్కిన అధికారులు అర ఎకరంకు సైతం కౌలు రైతు కార్డులు మంజూరు చేసారు. దీనితో రెచ్చిపోయిన దళారీలు అడ్డదారిలో విచ్చలవిడిగా కౌలు కార్డులు ఇప్పించి తమ జేబులు నింపుకున్నారు. జీరో బ్యాంకు ఖాతా తెరవటం మొదలు కౌలు రైతు కార్డులు ఇప్పించేంతవరకు అధికారులకు ముడుపులు ముట్టజెప్పి కౌలు రైతు కార్డులు వచ్చేంత వరకు అన్నీ తామై ఈ దళారీలు దగ్గరుండి పనులు చక్కబెడుతున్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కౌలు రైతులకు రైతు భరోసా కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసే మొత్తం రూ.13,500లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతాయి. ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం ఆయా కౌలు రైతు కార్డులు పొందిన వ్యవసాయ కూలీలను బ్యాంకుల వద్దకు పిలిపించి బ్యాంకులో జమ అయిన నగదును విత్ డ్రా చేసిన తర్వాత వారికి కొద్దిపాటి నగదు ముట్టజెప్పి పెద్ద మొత్తంలో ఈ దళారీలు వారి వద్ద నుంచి వసూలు చేసి తమ జేబులు నింపుకుంటున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు సుమారు మేడికొండూరు మండలంలో రూ.50 లక్షలకు పైగా ఈ దళారీలు జేబులు నింపుకున్నట్లు మండలంలో చర్చించుకుంటు న్నారు. దీనితో ప్రభుత్వం సదుద్దేశంతో తలపెట్టిన బలహీన వర్గాల కౌలు రైతు భరోసా నిజమైన రైతులకు అందక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి గత సంవత్సరం లబ్ధిదారులను విచారణ చేస్తే ఈ దళారీల బాగోతం బయటపడుతుందని మేడికొండూరులో భూ యజమానులు పెద్దఎత్తున చర్చించుకుంటున్నారు.

ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులు తక్షణమే పరిష్కరించాలి

కలెక్టర్ జె.వెంకట మురళి

విశాలాంధ్ర - బాపట్ల : ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు అధికారులు అధిక ప్రాధాన్యతనిచ్చి తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి అధికారులను ఆదేశించారు.జిల్లా ఎస్సీ,ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం జిల్లాస్థాయి నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం శుక్రవారం స్థానిక కలెక్టరేట్లో జరిగింది. గత సమావేశంలో చర్చించిన అంశాలు,వాటి పురోగతిపై చర్చ జరిగింది.బాధితులకు న్యాయం చేయడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ చెప్పారు. ఏదైనా ఘటన జరగగానే ప్రాథమిక విచారణ చేయాలన్నారు. నిబంధనలను అనుసరించి తక్షణమే చార్జ్ షీట్ వేయాలన్నారు.రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించాలన్నారు.వైద్య ధ్రువీకరణ పత్రాల జారీకి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రస్తుతం 47 కేసులకు నష్టపరిహారం అందించడానికి దస్త్రాలు సిద్ధం చేశామన్నారు.నిధులు విడుదల కాగానే నేరుగా బాధితులకు చేరుతాయన్నారు. అధిక నిధులు కావాలంటూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు.ప్రస్తుతం 83 కేసులు విచారణలో ఉన్నాయన్నారు.భూమి కేటాయింపులు, ఉద్యోగం నియామకాలపై చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అట్రాసిటీ చట్టం కింద నమోదైన కేసులను సత్వరమే ఎలా పరిష్కరించాలో అధికారులు ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు.స్మశాన భూములు లేని ఎస్సీ,ఎస్టీ గ్రామాలను గుర్తించాలన్నారు.ఏ గ్రామాలలో ఎంత భూమి అవసరత ఉందో,ఎంత భూమి కావాలనే అంశాలపై తక్షణమే నివేదిక ఇవ్వాలని రెవిన్యూ అధికారులను ఆదేశించారు.ఎస్సీ,ఎస్టీలకు అవసరమైన స్మశానభూమి కేటాయించేలా చర్యలు తీసుకుంటామన్నారు.అమలులో అడ్డంకులను తొలగించేలా చూస్తామన్నారు. అద్దంకి,గోవాడలో తక్షణమే స్మశాన భూమి కేటాయించాలన్నారు. మాదకద్రవ్యాలు నిరోధించడానికి పోలీసు అధికారులు కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. బాధితులకు భరోసా కల్పించే తక్షణమే సహాయ సహకారాలు అందించేలా చూస్తామని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ చెప్పారు. ఘటనలు జరిగిన ప్రాంతాలకు తక్షణమే పోలీసులు వెళ్లి విచారించేలా చర్యలు తీసుకుంటామన్నారు.చార్జిషీటు తక్షణమే నమోదు చేస్తామన్నారు. గ్రామాలలో విస్తృతంగా పర్యటిస్తామని చెప్పారు.ప్రజలలో సామాజిక చైతన్యం తీసుకువస్తామన్నారు. అట్రాసిటీ కేసులలో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని జిల్లా సంయుక్త కలెక్టర్ బి.సుబ్బారావు అన్నారు.కేసులలో ఎదురయ్యే సమస్యలన్నీ పరిష్కరిస్తామని వివరించారు.ఈ సమావేశంలో చీరాల ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య, జిల్లా కమిటీ కన్వీనర్ రాజా దిబోరా,కమిటీ సభ్యులు కట్టా శ్రీనివాసరావు,పి. ప్రసాద్ రావు,టి. సురేష్, జి.రాజారావు,జి.నాగమణి, అనుబంధశాఖల జిల్లా అధికారులు, ఆర్డీఓలు,డిఎస్పీలు పాల్గొన్నారు.

తైక్వాండో క్రీడాకారుడు కాలేషాకు సత్కారం

విశాలాంధ్ర - చీరాల : ఇటీవల నేపాల్లో జరిగిన ఇండో నేపాల్,ఇంటర్నేషనల్ ఛాంపియన్ షిప్ తైక్వాండో కరాటే పోటీల్లో బంగారు పతకం సాధించిన చీరాలకు చెందిన మైనార్టీ యువకుడు షేక్ కాలేషాను మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.చీరాల గంజిపాలెంలోని పీర్ల చావిడి ఆవరణలో చీరాల శాఖ గౌరవ అధ్యక్షులు సయ్యద్ అమీర్,అధ్యక్షులు షేక్ అల్లభక్షి,ఉపాధ్యక్షులు అబ్దుల్ ఘని,సెక్రటరీ షైక్, షౌకత్ అలీ,ట్రెజరర్ షేక్ ఇస్మాయిల్‌లు శాలువాతో సత్కరించి,నగదు ప్రోత్సాహం అందచేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

రైళ్లలో చోరీ అరెస్టు

విశాలాంధ్ర - చీరాల : రైళ్లలో బ్యాగులను అపహరించే వాడరేవుకి చెందిన పెదాల వెంకటేష్ అనే దొంగను చీరాల రైల్వే పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు.అతడి వద్ద నుండి రూ.3 లక్షల 81 వేలు విలువ చేసే బంగారు ఆభరణాలు,ల్యాప్‌టాప్‌లు,సెల్ ఫోన్లు,ఐపాడ్లు,వాచీలు స్వాధీన చేసుకున్నామని నెల్లూరు రైల్వే డిఎస్పీ విజయభాస్కరరావు తెలిపారు.పెదాల వెంకటేశ్వర్లు చదువు లేకపోవడంతో జల్సాలకు అలవాటు పడి కూలీ పని చేస్తే వచ్చే నగదు సరిపోక దొంగతనాలకు అలవాటు పడ్డాడని, యు ట్యూబ్ ఇన్‌స్టాగ్రామ్లో వీడియోలు చూసి సులభంగా డబ్బు సంపాదించాలని రైళ్లలో దొంగతనాలకు అలవాటు పడ్డాడన్నారు.ఉన్నతాధికారులు గుంతకల్లు రైల్వే జిల్లా సూపరిండెంట్ చౌడేశ్వరి ఆదేశాలతో నెల్లూరు డిప్యూటీ సూపరిండెంట్ విజయభాస్కర్రావు,సూచనలతో ఒంగోలు జిఆర్పీ సర్కిల్ ఇన్‌ఛార్జి ఇనిస్పెక్టర్ భుజంగరావు ఆధ్వర్యంలో దొంగను చీరాల రైల్వే ఎస్. ఐ కొండయ్య పట్టుకున్నారని తెలిపారు. చీరాల రైల్వే ఎస్ఐ కొండయ్యతో పాటు సిబ్బందిని అభినందించారు.

అమ్మవారికి వెండి పళ్ళెం బహూకరణ

విశాలాంధ్ర - పిట్లలవానిపాలెం : మండలంలోని చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీభగలాముఖి అమ్మవారికి ఆషాడ మాసం శుక్రవారం సందర్భంగా సోడిపాలెం గ్రామానికి చెందిన చిరసాని వెంకటేశ్వర్ రెడ్డి, చిరసాని తేజశ్వి దివాకర్ రెడ్డి, కాటేపల్లి కేశవరావులు అమ్మవారికి రూ.1,50,000 విలువగల కేజిన్నర వెండి పళ్లాన్ని అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆలయ కార్యనిర్వాహణాధికారికి శుక్రవారం అందజేశారు.ఈ సందర్భంగా దాతలకు ఆలయ మర్యాదలతో వేద ఆశీర్వచనం జరిపించి శేష వస్త్రాన్ని బహూకరించారు.

కలెక్టర్‌ని కలిసిన ఎస్పీ తుషార్ డూడి

విశాలాంధ్ర - బాపట్ల : జిల్లా నూతన ఎస్పీ తుషార్ డూడి శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళిని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు.అనంతరం ఇరువురు జిల్లాలోని పరిస్థితుల గురించి,శాంతి భద్రతల సమస్యల గురించి చర్చించుకున్నారు.

విలువలతో కూడిన విద్యను అందించడమే లక్ష్యం

వి.ఆర్.ఎస్.వై.ఆర్.ఎన్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ పొగడదండ రవికుమార్

విశాలాంధ్ర - చీరాల : విలువలతో కూడిన విద్యను అందించడమే లక్ష్యం అని వి.ఆర్.ఎస్.వై.ఆర్.ఎన్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ పొగడదండ రవికుమార్ అన్నారు.శుక్రవారం చీరాలలో వి.ఆర్.ఎస్.వై.ఆర్.ఎన్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ రవికుమార్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలువలతో కూడిన సాంకేతిక విద్యను అందించడమే లక్ష్మమని ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తామన్నారు.కళాశాల మేనేజిమెంట్ కోటలో ప్రతి సంవత్సరం 50 సీట్లు ప్రతిభ కలిగిన విద్యార్థులకు అందిస్తామన్నారు.ప్రపంచం సాంకేతిక అభివృద్ధిలో పరు గులు పెడుతుందని అటువంటి ప్రపంచ స్థాయి విద్యను చీరా లలో కూడా అందిస్తామని తెలిపారు. ఐబిటీ అధ్యాపకులచే సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యను అందిస్తున్నామని చెప్పడానికి గర్వపడుతున్నామన్నారు.ఆపరేషన్ 2034 నిర్వహిస్తున్నమని వచ్చే ఏడాది నుంచి కేజీ టూ పీజీ విద్యను అందిస్తామని ప్రతిభవంతులైన విద్యార్థులను తయా రు చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నా మన్నారు. ప్రతిభ కలిగిన విద్యార్థులకు ఉచిత విద్యను అందించడమే కాక ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తమ యలమంచిలి గ్రూప్ ఆఫ్ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు.పేద బడుగు బలహీన వర్గాలు ఉన్న చీరాలలో లాభాపేక్ష లేకుండా సేవదృక్పథంతో విలువతో కూడిన విద్యను అందిస్తామని చీరాల పరిసర ప్రాంతాలలోని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కూటమి ప్రభుత్వానికి ప్రజలు సహకరించండి

టీడీపీ బీసీ సాధికారిక సమితి పద్మశాలి రాష్ట్ర డైరెక్టర్ తాడి పర్తి మల్లికార్జునరావు

విశాలాంధ్ర - రేపల్లె : గత ఐదు సంవత్సరాలు రాష్ట్రం కోసం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఏపీ ప్రజల కోసం అహర్నిశలు కృషి చేశారని రాష్ట్ర టీడీపీ బీసీ సాధికారిక సమితి పద్మశాలి రాష్ట్ర డైరెక్టర్ తాడిపర్తి మల్లికార్జునరావు అన్నారు.శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల్లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా చేశారని, ఇలాంటి పాలకులను ఇక గద్దె దించాలనే ఆలోచనతో రాష్ట్ర ప్రజలు టీడీపీకి అధికారం ఇచ్చిన తీర్పును మన అందరం గౌరవించాలన్నారు.వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆలోచనలు రాష్ట్రంలో విధ్వంసా లు సృష్టించి,రాష్ట్ర పరిపాల నను పక్కదావ పట్టించి, తిరిగి ప్రజలలోకి వెళ్లి విష ప్రచారం చేయడానికి అనేక రకాలుగా ప్రయోగాలు చేస్తాడు మనము అప్రమత్తంగా ఉండాలన్నారు.మనం ఈ ఐదు సంవత్సరాలు సహనాన్ని పాటించాల్సిన సమయం ఉన్నదని,ప్రజలకు మనమీద గౌరవం పెరిగే విధముగా పరిపాలన సాగాలన్నారు.చంద్రబాబు నాయుడు రాష్ట్రం కోసం రాత్రింబవళ్లు పడిన బాధ ఆవేదనకి ఒక అర్థం ఉంటుందని,రాష్ట్ర ప్రజలు అర్థం చేసుకుని నడుచుకోవాలి అని మల్లికార్జున రావు ప్రజలకు విన్నవించారు.వినుకొండ పుంగనూరులో జరిగిన సంఘటన నిదర్శన మనీ,వైసీపీ పార్టీలో గొడవలు సృష్టించి మన బాబు మీద విష ప్రచారం చేయడానికి వెనకాడని వైఎస్ జగన్ అని మనందరం గుర్తుంచుకోవాల న్నారు. సీఎం నారాచంద్రబాబునాయుడు పరిపాలన సక్రమంగా సాగే విధంగా మన అందరం ప్రభుత్వానికి సహకరిద్దాం అని మల్లికార్జునరావు పేర్కొన్నారు.

వైభవంగా రాజరాజేశ్వరి తిరునాళ్లు

విశాలాంధ్ర - చీరాల రూరల్ : మండలంలోని రామకృష్ణాపురం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ రాజ రాజేశ్వరీ అమ్మవారి (బొద్దురాయి అమ్మవారు) తిరునాళ్ళ మహోత్సవం వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ పరిసర ప్రాంతాలను విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు.అమ్మవారిని,చిన బొద్దురాయి , పుష్ప మాలికలతో,ఆభరణాలతో అలంకరించారు. కనక తప్పెట్లతో,మంగళ వాయిద్యాల మధ్య అమ్మవారి చల్లి ఘటాన్ని ఊరేగింపు చేశారు. భక్తులు అమ్మవారికి వారు పోసి చల్లి, నైవేద్యాలు సమర్పించారు. భక్తులు మొక్కుబడులు చెల్లించుకున్నారు. నూలుతో కట్టిన ప్రభ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఆహుతులను సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్ధ ప్రసాదాలు అందించారు. నూతనంగా పెట్టిన స్టాళ్ల వద్ద పిల్లల సందడి కన్పించింది. ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.